సాక్షి శ్రీకాకుళం

గురువారం । 14 । మార్చి । 2024




కౌంటింగ్ కేంద్రంగా శివానీ కాలేజ్

రానున్న ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంగా ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేశామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రకటించారు. - 8లో



అపరిష్కృత కేసులపై దృష్టి పెట్టాలి

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. - 8లో



న్యూస్‌రీల్

నేడు కిడ్నీ అవగాహన సదస్సు

కాశీబుగ్గ : ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా పలాసలోని వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. కిడ్నీల పనితీరు, సమస్యలు, వ్యాధి గుర్తింపు, చికిత్సా విధానం, స్థానికంగా అందుతున్న సదుపాయాలపై అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

158 మందికి రూ.1,01,57,000 పంపిణీ



ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అందజేస్తున్న కలెక్టర్ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పి.ఎం .సూరజ్ పథకం కింద ఎస్సీ, ఓబీసీ, సఫారీ కర్మచారీ కార్మికులకు సంబంధించి 158 మంది లబ్ధిదారులకు రూ.1,01,57,000లను, 31 మందికి నమస్తే ఆయుష్మాన్ భారత్‌హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ప్రధాని మోదీ నుంచి ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్ష రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్ రెడ్డి, ఎల్‌డీఎం సూర్యకిరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు, శ్రీశయన కార్పొరేషన్ ఛైర్మన్ డి.బి.దేవ్ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి ఆలయ ఈవోగా చంద్రశేఖర్



ఎస్.చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను అరసవల్లికి, ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబుకు అన్నవరం డిప్యూటి ఈవోగా బదిలీ చేశారు. కొత్తగా డీసీ హోదాలో రానున్న చంద్రశేఖర్ గతేడాది నాలుగు నెలల పాటు శ్రీకాకుళం జిల్లా దేవదాయ శాఖాధికారిగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు అరసవల్లి ఆలయానికి డీసీ హోదాలో మళ్లీ రానున్నారు. గురువారం ఉదయం అరసవల్లిలో ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదిత్యుని ఆలయానికి గత నెలలో డీసీ హోదా కల్పించి ఫిబ్రవరి 8న తొలి డీసీగా డి.ఎల్.వి. రమేష్‌బాబును నియమించిన సంగతి తెలిసిందే.

చార్జిషీట్ ఫైలింగ్‌లో అలసత్వం తగదు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలులో ఉన్న ముద్దాయిల కేసులకు సంబంధించి పోలీసులు త్వరితగతిన చార్జిషీట్స్ ఫైల్ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. ఈ విషయంలో పోలీసులు అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కర్‌రావు, మహేంద్ర ఫణికుమార్, అనురాధ, జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి




కిడ్నీ బాధితులకు కొండంత అండ

ఎలా సంక్రమిస్తుందో.. తెలీదు.. దాన్ని ఎలా అడ్డుకోవాలో అంతకంటే తెలీదు. ఫలితంగా దశాబ్దాలుగా దాని దాడికి వేలాది వ్యక్తులు, వందలాది కుటుంబాలు గురయ్యాయి. అప్పులను పోగొట్టుకున్నారు కొందరైతే.. వైద్యానికి ఆస్తులను కరిగించేసి రోడ్డున పడిన వారెందరో. ఈ మహమ్మారి నుంచి తమను రక్షించేవారే లేరా అని బిక్కచచ్చిపోయి.. బిక్కుబిక్కుమంటున్న తరుణంలో నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ ముందుకొచ్చి అభయహస్తం అందించారు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. డయాలసిస్ సెంటర్లు పెంచారు.. డయాలసిస్ రోగులకు ఖర్చుల కోసం నెలకు రూ.10 వేల పెన్షన్ ఇస్తున్నారు. కిడ్నీ పరిశోధనలు, సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం పలాసలో ఆస్పత్రి, రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉద్దానం కిడ్నీ బాధితులకు కొండంత అండగా నిలిచారు. నేడు కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం, సేవలపై ప్రత్యేక కథనం.

- డయాలసిస్ రోగులకు రూ.10,000 పెన్షన్ చెల్లిస్తున్న సర్కార్
- ఉద్దానానికి శుద్ధజలం సరఫరా
- పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి

నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



కవిటి: గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కిడ్నీ బాధితులకు నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారు. నేను చూశాను..నేను విన్నాను..నేను ఉన్నాను అంటూ 2019లో జరిగిన ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలను అధికారంలోకి వచ్చాక కార్యరూపం దాల్చి అండగా నిలుస్తున్నారు. ప్రత్యేకించి ఉద్దానం ప్రాంతంలో అంతుచిక్కని కారణాలతో వ్యాధి బారిన పడుతున్న వేలాది మంది కిడ్నీ బాధితుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, రూ.800 కోట్లతో వైఎస్సార్ సుజలధార పథకం కింద ఇంటింటికీ రక్షిత మంచినీరు, డయాలసిస్ రోగులకు రూ.10,000 పెన్షన్ అందించి బాధితులకు బతుకుపై భరోసా కల్పించారు. జిల్లాలో రిమ్స్ ఆస్పత్రితో పాటు టెక్కలి, హరిపురం, పలాస, సోంపేట, కవిటి మండలాల్లో పడకల సంఖ్యను భారీగా పెంచి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రోగులకు నిరాటంకంగా డయాలసిస్ సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

గాలికొదిలేసిన టీడీపీ..

- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు అరకొరగా బెడ్లు ఉండేవి. నేడు వాటి సంఖ్యను భారీగా పెంపుదల చేశారు. అప్పట్లో తూతూ మంత్రంగా చెల్లించిన రూ.2000 డయాలసిస్ పెన్షన్ బాధితులకు ఏ మూలకూ సరిపోలేదు. ఎన్నికల సమీపించే సమయంలో చివరి రెండు మూడు నెలలు రూ.3000కు పెంచి మమ అనిపించేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కిడ్నీ రోగుల పట్ల ప్రత్యేక దృష్టి సారించారు. డయాలసిస్ రోగులకు ఏకంగా రూ.10,000 పింఛన్ పెంచి అండగా నిలిచారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఆధునిక జీవనశైలి మనిషి జీవనాన్ని యాంత్రికంగా మార్చేసింది. విద్యార్థులు ఆటస్థలాలకు తక్కువ సమయం కేటాయించడం, యువతీ యువకులు వ్యాయామానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎక్కువ శాతం మంది బీపీ, షుగర్ వ్యాధుల బారినపడుతున్నారు. ఈ వ్యాధులకు సరైన రీతిలో మందులు వాడకపోవడంతో దుష్ప్రభావాలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా కిడ్నీల పనితీరు మందగించి డయాలసిస్ స్థితికి చేరుకుంటున్నాయి.
- ఈ నేపథ్యంలో మార్నింగ్‌వాక్, యోగా, మెడిటేషన్ వంటి శారీరక వ్యాయామాల్ని ఆచరించడం ద్వారా కిడ్నీల పనితీరును కాపాడుకోవచ్చు. ప్రధానంగా ఫాస్ట్‌ఫుడ్ ఆహారానికి దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్ స్థానంలో తక్కువ కేలరీలు గల పండ్లు తినాలి.
- వ్యాయామం తప్పనిసరి చేసుకోవాలి.



వైఎస్సార్ సుజలధార

ఆదుకుంటున్న ఆశాకిరణం



పలాస కిడ్నీ ఆస్పత్రిలో గ్రాఫ్ట్ ఆపరేషన్ అనంతరం భవానీతో వైద్య బృందం (ఫైల్)

ఉద్దానం ఆశాకిరణంగా భావిస్తున్న పలాస కిడ్నీ ఆస్పత్రి తన పని మొదలుపెట్టింది. ఇన్నాళ్లూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం శ్రీకాకుళం, ఆపరేషన్ల కోసం విశాఖకు పరుగులు పెట్టిన జిల్లా వాసులకు ఇప్పుడు పలాసలోనే శస్త్ర చికిత్స చేయించుకునే భాగ్యం లభించింది. పలాసకు దాదాపు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న లావేరు మండలం నుంచి వోయివోని భవానీ అనే పేషెంట్ ఇటీవల కిడ్నీ ఆస్పత్రికి వచ్చి ఏవీఎఫ్ గ్రాఫ్ట్ అనే ఆపరేషన్ చేయించుకున్నారు. డయాలసిస్ పేషెంట్లకు నరాలు బలహీనమైపోయిన దశలో ఓ యంత్రం అమర్చి దాని ద్వారా రక్తశుద్ధి చేసి శరీరంలోకి రక్తం పంపడం ఈ ఆపరేషన్ ఉద్దేశం. ఇన్నాళ్లూ ఈ శస్త్ర చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వేలాది రూపాయలు ధారబోయాల్సి వచ్చేది. ఇప్పుడు కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఉచితంగా జరగడంతో వేలాది మందికి భరోసా ఏర్పడింది.

ఉద్దానం ముద్దుబిడ్డ జగనన్న



కాశీబుగ్గలో కిడ్నీరీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్దానం ముద్దుబిడ్డగా సీఎం జగన్ నిలిచారు. రూ.800 కోట్ల వ్యయంతో ఉద్దానం ప్రజలకు సురక్షిత ఉపరితల జలాలతో తాగునీటి పథకం ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించారు. ఇటీవల ఏపీహెల్త్ కమిషనర్ దృష్టికి ఉద్దానం కిడ్నీవ్యాధుల సమస్య తెలియజేయగా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో ఐదు డయాలసిస్ యూనిట్లతో కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

క్రమబద్ధంగా వైద్యపరీక్షలు..



క్రమంతప్పని వ్యాయామంతో పాటు ఆహారంలో చక్కెర, ఉప్పు బాగా తగ్గించాలి. హైబీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారు మూడు నాలుగు నెలలకోసారి సీరంక్రియేటినైన్ పరీక్షించుకోవాలి. నిర్ణీత పరిమాణంలో నీటిని తాగాలి. డయాలసిస్ చేయించుకుంటున్న వారు నీటిని పరిమితంగా తీసుకోవాలి. – డాక్టర్ రాయపురెడ్డి రంగనాథరావు, నెఫ్రాలజిస్ట్, శ్రీకాకుళం

మేలు మరువలేం..



డయాలసిస్ రోగులకు నెలవారీ అందిస్తున్న రూ.10,000 పెన్షన్ మా జీవితాలకు ఓ భరోసా ఇచ్చింది. మాలాంటి వారికి అప్పు కూడా పుట్టని స్థితిలో ఆ పెన్షన్ ఆదుకుంటోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలు మరువలేనిది.

-బి.సూరయ్య, కొత్తపుట్టుగ, కవిటి మండలం



కవిటి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

కొరియర్ పేరిట సైబర్ మోసం



శ్రీకాకుళం క్రైమ్ : హలో.. ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీస్.. హౌ కెన్ హెల్ప్ యూ.. అంటూ మనకు ఫోన్ లైన్ కలుపుతారు. వారితో మాట్లాడితే అంతే సంగతులు.. కొరియర్ ముసుగులో.. మన ఖాతాలోని డబ్బులు అలవోకగా కొట్టేస్తారు. జిల్లాలో తాజాగా ఈ తరహా కేసు నమోదు కాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు గత నెలాఖరున ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామంటూ కొందరు ఫోన్ చేశారు. తైవాన్ నుంచి ముంబై అడ్రస్‌కు మీ పేరిట పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉండటంతో నార్కోటిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, దీనిపై ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసులు గానీ, ఢిల్లీ పోలీసులు గానీ కాల్ చేస్తారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత ముంబై పోలీసులమంటూ కొందరు వీడియో కాల్ చేశారు. పార్సిల్‌లో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టు ఉన్నాయని, మీపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని బెదిరించారు. యువకుడు పార్సిల్ నాకే ఎందుకొచ్చిందని ప్రశ్నించగా నీవు పనిచేసే కంపెనీ, నీవు డ్రగ్స్ కావాలంటూ ఆన్‌లైన్‌లో పెట్టిన ఆర్డర్ అంతా మా వద్ద ఉన్నాయని.. స్టేట్‌మెంట్ రికార్డింగ్ అంటూ హడావిడి చేసి ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాలు తీసుకున్నారు. జరిమానా కింద రూ.30 లక్షల వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవ్వడం కుదరదని యువకుడు చెప్పడంతో నీపై మనీ లాండరింగ్ కేసు అవుతుందని, సీబీఐ, కస్టమ్స్ పోలీసులు మీ ఇంటికొస్తారని హడలెత్తించడంతో పరువు పోతుందేమోనని యువకుడు భయపడ్డాడు. చేసేదేమీ లేక ఈ నెల దఫదఫాలుగా రూ.20 లక్షల వరకు వారు చెప్పిన ఖాతాల్లోకి మళ్లించాడు. అయినా ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో మోసానికి గురయ్యానని గుర్తించి 1930 సైబర్‌సెల్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు.

నేడు ఈబీసీ నేస్తం

- అగ్రవర్ణాల మహిళలకు రూ.15 వేలు ఆర్థిక సాయం
- జిల్లాలో 2529 మందికి రూ.3.53 కోట్లు లబ్ధి



శ్రీకాకుళం పాతబస్టాండ్: అగ్రవర్ణాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య పేద మహిళలకు ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకం కింద రూ.15 వేలు అందజేయనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల జిల్లా నుంచి ఈ నగదు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో ఈ ప్రయోజనం చేకూర్చగా మరో విడతకు సిద్ధమయ్యారు. జిల్లాలో తొలి విడత(2021–22)లో 2353 మందికి రూ.3.53 కోట్లు జమ చేశారు. రెండో విడత(2022–23)లో 2632 మందికి రూ.3.94 కోట్లు అందజేశారు. మూడో విడత(2023–24) కింద గురువారం 2529 మందికి రూ.3.53 కోట్లు జమ చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

అగ్రవర్ణాల పేద మహిళలకు ఈబీసీ నేస్తం పేరిట ప్రభుత్వం అందజేస్తున్న రూ.15 వేలను లబ్ధిదారులు సద్వినియోగంచేసుకోవాలి. ఇప్పటికే రెండు విడతలుగా జమ చేశారు. మూడో విడత గురువారం అందజేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కార్యక్రమం జరగనుంది.

– ఆర్.గడ్డెమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ, శ్రీకాకుళం

డ్రోన్ సాగుతో అధిక లాభాలు



డ్రోన్ దీదీలను అభినందిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయంలో డ్రోన్‌లను వినియోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం డ్రోన్ దీదీలను మంత్రి ధర్మాన అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నేతాజీ, వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, ఎంపీపీ అంబటి నిర్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారులు ఉషాకుమారి, పద్మావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చంద్రబాబుది మాటలు మార్చే వ్యక్తిత్వం

● మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: ప్రతిసారి మాటలు మార్చే వ్యక్తిత్వం చంద్రబాబుదని, సంక్షేమ పథకాల అమలు తప్పు అన్న ఈ వ్యక్తే ఇప్పుడు అంతకన్నా ఎక్కువ చేస్తామని చెప్పడం పెద్ద డ్రామా అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ చేయూత సంబరాల్లో భాగంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. ఎన్నికల ముందు చెప్పినవన్నీ చేశామని, గతంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లు ఏమీ ఇవ్వకుండా మాయమాటలు చెప్పి, గ్రాఫిక్స్ చూపించి, ఆఖరులో పసుపు కుంకుమ అని విదిలిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు కావాలో.. పాదయాత్రలో చెప్పిన హామీలన్నీ అమలు చేసి పైసా లంచం తీసుకోకుండా ఇంటి యజమానురాలు మహిళ పేరిట నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి కావాలో నిర్ణయించుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కంటే ఆర్థిక పరిపుష్టి కలిగించిన ఈ ప్రభుత్వాన్ని వదులుకుంటే మిగిలిన ప్రతిపక్ష పార్టీలు గుండు సున్నా చూపుతాయన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్



ఎన్‌సీసీ విద్యార్థిని అభినందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: మండల కేంద్రం పొందూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం సందర్శించి అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, చక్కగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

కవయిత్రి మొల్లకు నివాళులు



మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రామాయణాన్ని తెలుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ(మొల్ల) అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మొల్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతుల అధికారి అనురాధ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ హెల్ప్ లైన్ అనే యాప్ ద్వారా ఎపిక్ కార్డు పొందవచ్చన్నారు. పొలిటికల్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు, మెప్మా సంచాలకుడు కిరణ్, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీఓ ఎస్.బాలరాజు, శేషగిరి, ఎల్.డి.ఎం.సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సహకార సంఘాల డైరెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ సహకార సంఘాల డైరెక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ బుధవారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు.

240 మద్యం బాటిళ్ల పట్టివేత

రణస్థలం: లావేరు మండలం మురపాకలో కుప్పిలి మోహన్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 240 మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మురపాక ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించారు. నిందితుడు మోహన్ వద్ద లభించిన మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌కు అప్పగించారు. ఎస్ఈబీ ఎస్సై ఎం.రవిప్రసాద్ బుధవారం కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. మోహన్ స్వగ్రామం ఎచ్చెర్ల మండలం కుప్పిలి.



టెక్కలి: లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్, చింతాడ మంజు, సర్పంచ్ సుజాత తదితరులు



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో నిర్వహించిన సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



కంచిలి: లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న జడ్పీ వైస్‌ చైర్‌పర్సన్ పిరియా విజయ

అతివలకు అండగా..!

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు నాలుగో విడతగా రూ.18750 చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుండటంతో ఆనందం వెల్లివిరుస్తోంది. దీంతో వైఎస్సార్ చేయూత సంబరాల్లో మళ్లీ జగనన్నదే విజయమంటూ నినాదం ప్రతిధ్వనిస్తోంది. బుధవారం శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో చేయూత సంబరాలు ఘనంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గార: లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

వారిని వదలొద్దు..!

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తనకు జరిగిన మేలును ఎంతో సంతోషంగా, స్వేచ్ఛగా మీడియా ముందు చెప్పిన గీతాంజలిని టీడీపీ, జనసేన మూకలు వేధించి మృతికి కారణం కావడంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ అన్ని వర్గాల వారు డిమాండ్ చేశారు. మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– నరసన్నపేట/బూర్జ/ఇచ్ఛాపురం రూరల్/కొత్తూరు



కఠిన చర్యలు తీసుకోవాలి..



గీతాంజలి స్వేచ్ఛగా తనకు జరిగిన మేలు చెప్పారు. దీనిపై టీడీపీ, జనసేనలకు చెందిన సోషల్ మీడియా వారు కించపరిచేలా, అవమానకరంగా పోస్టులు పెట్టి ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా వ్యవహరించారు. ఈ విధంగా ఎవరు పోస్టులు పెట్టారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. గీతాంజలి కుటుంబానికి మద్దతుగా నిలవాలి. – కోరాడ ఆశాలత గుప్త, సుడా చైర్‌పర్సన్

స్వేచ్ఛను హరించడమే..



ప్రభుత్వాలు పేదల మేలు కోసం పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిని పొందిన వారు వారి ఆనందాన్ని పంచుకుంటూ స్టేట్‌మెంట్లు ఇవ్వడం కూడా నేరమేనా? గీతాంజలి ఆత్మహత్య చేసుకునేలా పోస్టులు పెట్టడం శోచనీయం. ఇలా చేయడం మహిళల స్వేచ్ఛను హరించడమే.

– ఎంఆర్ జ్యోతీ ఫ్రెడరిక్, విశ్రాంత ప్రిన్సిపాల్

ట్రోలింగే కారణం..



గీతాంజలి మృతికి సోషల్ మీడియా ట్రోలింగే కారణం.ఒక ఇల్లాలిని ఇంత దారుణంగా ట్రోల్ చేసి విమర్శించడం దుర్మార్గం. ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి.

– బొడ్డేపల్లి రమణమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, బూర్జ మండలం

మానసిక వేదనతోనే..



టీడీపీ, జనసేన పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గీతాంజలి అనే మహిళను సోషల్ మీడియా ద్వారా వేధించి నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ట్రోలింగ్ చేయడంతో మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకుంది. మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. – గంగరాపు ఈశ్వరమ్మ, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు

కేసులు నమోదు చేయాలి



తనకు అందించిన సంక్షేమాన్ని మీడియా సాక్షిగా చెప్పిన గీతాంజలిని మానసికంగా వేధించి చంపేసింది టీడీపీ, జెనసేన సోషల్ మీడియా వారే. గీతాంజలి నిజం చెప్పడమే నేరమైతే ప్రతి రోజూ సామాజిక మాధ్యమాల్లో అబద్ధాలు చెప్పే తండ్రీ, కొడుకులు నారాచంద్రబాబు, లోకేశ్‌లను ఎంతలా ట్రోల్ చెయ్యాలో టీడీపీ–జెనసేన పార్టీలు చెప్పాలి. మృతికి కారుకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి. – నల్ల సుగుణ దేవరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

యువతి అనుమానాస్పద మృతి

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి ఊర్వశి(19), అదే గ్రామానికి చెందిన బి.శ్యాం కుమార్ ప్రేమించుకుని ఊరు విడిచి వెళ్లిపోయారు. ఇటీవలే ఇద్దరూ గ్రామానికి తిరిగి వచ్చేశారు. శ్యాం కుమార్ ఇంట్లోనే ఊర్వశి ఉంటోంది. ఏం జరిగిందో గానీ బుధవారం ఉదయం ఇంట్లో శ్యాంకుమార్, కుటుంబ సభ్యులు లేని సమయంలో ఊర్వశి తాడుతో ఉరివేసుకుని మృతిచెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ కూర్మారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి తల్లి కర్రి పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కవిటి ఎస్ఐ కె. రాము తెలిపారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం పూర్తిగా దర్యాప్తు చేసి కోర్టుకు నివేదిక అందజేస్తామని ఎస్ఐ తెలిపారు. శ్యాం, ఊర్వశి మరికొద్ది రోజుల్లో పెళ్లిచేసుకునేందుకు కూడా సిద్ధమైనట్టు గ్రామస్తులు చెబుతున్నారు.



ఊర్వశి మృతదేహం

అపరిష్కృత కేసులపై దృష్టి పెట్టాలి

శ్రీకాకుళం క్రైమ్ : పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్రమైన (గ్రేవ్) కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలు సేకరించి సమగ్ర దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వాస్తవాలను పరిశీలించి లీగల్‌గా దర్యాప్తు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి మద్యం, నాటుసారా, గంజాయి వంటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. అనంతరం క్రైమ్ డిటెక్షన్, అక్రమ రవాణాపై సమాచారం సేకరణలో ప్రతిభ కనబర్చిన హెడ్ కానిస్టేబుల్ మోహనరావు, కోదండరావు, రమణమూర్తి, కానిస్టేబుల్ ఉషాకిరణ్‌లకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్, టెక్కలి, కాశీబుగ్గ, శ్రీకాకుళం డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వర రెడ్డి, యర్రగుంట శృతి, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ బి.విజయ్‌కుమార్, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ త్రినాధరావు,ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఎస్పీ రాధిక చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ రమణమూర్తి

కౌంటింగ్ కేంద్రంగా శివానీ కాలేజ్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

రానున్న ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంగా ఎచ్చెర్లలోని శివాని ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేశామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రకటించారు. అనుబంధ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి వారపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా ఎన్నికల యంత్రాంగానికి తెలియజేయవచ్చన్నారు. గత రెండు నెలల వ్యవధిలో 2,82,688 ఓటర్ గుర్తింపు (ఎపిక్) కార్డులను ముద్రణకు పంపించామని, వీటిలో 1,83,907 కార్డులను పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేశామని, మిగిలిన వాటిని వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ అధికారులకు ఇప్పటికే పలు దశల్లో శిక్షణ పూర్తి చేశామన్నారు. ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు 18004256625 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, నాయకులు రొతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు (టీడీపీ), సురేష్‌బాబు సింగ్ (బీజేపీ), డి.మల్లిబాబు (కాంగ్రెస్), లాస సోమేశ్వరరావు (బీఎస్పీ), తిరుపతిరావు (సీపీఐ) తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ పలక విరిగిపడి ఇద్దరికి గాయాలు

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామంలో సెప్టిక్ ట్యాంక్‌పై పలకలు వేస్తుండగా అందులో ఒక పలక విరిగిపడటంతో తండ్రీ కొడుకులు బాలి వెంకటరమణ, బాలి వెంకటనాయుడులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ అన్నారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని 'సైబర్ నేరాలు–తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఆశ్రా సంస్థ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించనున్న అవగాహన సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంజి ఎజ్రా, లఖినాన రవికుమార్, కట్టా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రైసు మిల్లుల్లో దొంగలు హల్‌చల్

నరసన్నపేట: మండలంలోని జమ్ము కూడలిలో రైసు మిల్లుల్లో మంగళవారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. వరుసగా మూడు మిల్లులతో పాటు ఒక విస్తరాకుల పరిశ్రమలో చోరీలకు ప్రయత్నించారు. బీరువాలు తెరిచి డబ్బుల కోసం వెతికారు. అక్కడి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. హార్డ్ డిస్కులను ఎత్తుకుపోయారు. జమ్ము కూడలి వద్ద శాంతా రామా, శాంతామణి, లక్ష్మి నాగేశ్వరా రైస్ మిల్లులతో పాటు పక్కనే ఉన్న విస్తరాకుల తయారీ పరిశ్రమలో కూడా చోరీకి ప్రయత్నించారు. మిల్లుల వద్ద ఉన్న నైట్ వాచ్‌మేన్లను చంపుతామని కూడా బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ చోరీల్లో 10 నుంచి 16 మంది వరకు పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు మిల్లులను పరిశీలించారు. కాగా చోరీలకు సంబంధించి రైస్‌మిల్లర్లు ఎటువంటి ఫిర్యాదులు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.



తెరిచి ఉన్న బీరువా

సమరశీల పోరాటాలే శరణ్యం

సోంపేట: సమరశీల పోరాటాలు చేయడమే తొలితరం కామ్రేడ్స్‌కు మనం ఇచ్చే గౌరవమని సీపీఎం పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మధు అన్నారు. సోంపేట మండలం మామిడిపల్లిలో తొలితరం కమ్యూనిస్టు గానుగుల తరుణాచారి స్మారక స్థూపాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుణాచారి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని, జమిందారీ వ్యతిరేక పోరాటం, రైతు రక్షణ యాత్రలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.గోవిందరావు, జుత్తు సింహాచలం, పాతిన కృష్ణమూర్తి, సంగారు లక్ష్మీనారాయణ, తెప్పల పాపారావు, కర్రి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మధు

వాహనం ఢీకొని యువకుడి మృతి

కొత్తూరు: మండలంలోని కురిగాం గ్రామానికి చెందిన యువకుడు గెల్లంకి గణేశ్వరరావు(26) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కురిగాం గ్రామానికి చెందిన గెల్లంకి అప్పారావు, నర్సమ్మల దంపతుల రెండో కుమారుడు గణేశ్వరరావు మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో భోజనం చేసి కురిగాం–పర్లాకిమిడి రోడ్డుపైకి స్నేహితులతో కలిసి వచ్చాడు. బహిర్భూమికి వెళ్తుండగా పర్లాకిమిడి నుంచి హడ్డుబంగి వైపు వచ్చిన భారత్‌బెంజ్ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గణేశ్వరరావును కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎంఏ అహమ్మద్ తెలిపారు.



గణేశ్వరరావు మృతదేహం

లోయలోకి దూసుకెళ్లిన లారీ

● కిల్లాం, జమ్ములకు చెందిన క్లీనర్, డ్రైవర్లు మృతి
● ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లాలో ప్రమాదం

నరసన్నపేట : ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలానికి చెందిన ఇద్దరు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిల్లాం గ్రామానికి చెందిన గొలివి ఆదినారాయణ(44), జమ్ముకు చెందిన కొయ్యాన చిన్నారావు(34)లు లారీ డ్రైవర్, క్లీనర్స్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం నేపాల్ సరిహద్దులకు లోడు తీసుకొని పయనమయ్యారు. ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లా బైరపడా వద్దకు రాత్రి 11.30 సమయానికి వెళ్లే సరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోతైన ప్రదేశంలో బోల్తా పడింది. ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వేకువజామున ఇరు కుటుంబాలకు సమాచారం అందడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆదినారాయణకు తల్లిదండ్రులు రాములు, తవిటమ్మ, భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్నారావుకు భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మయూర్‌భంజ్‌కు కుటుంబ సభ్యులు తరలివెళ్లారు.



ఆదినారాయణ (ఫైల్)



కొయ్యాన చిన్నారావు (ఫైల్)

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఈవీఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ పేపర్, లా అండ్ ఆర్డర్, ఎలక్షన్ వ్యయం, పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై క్రమపద్ధతిలో రూపొందించిన ప్రణాళికను పక్కాగా అమలు చేయాలరు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మానవ వనరులు, ఎన్నికల సామగ్రి, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్, సి–విజిల్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్, తదితర అంశాలలో సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రేమకాజల్, రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్, ఆర్డీవోలు సీహెచ్.రంగయ్య, భరత్ నాయక్, డ్వామా పీడీ చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పూర్తి



శ్రీకాకుళంలోని ఓ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు–2024 తుది దశకు చేరుకున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రధాన పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల 15వ తేదీతో ద్వితీయ సంవత్సర పరీక్షలు ముగియనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ ఉన్నతాధికారుల సూచనలతో జిల్లా అధికారులు పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు బృందాలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

10వ రోజు 977 మంది గైర్హాజరు..

జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో 10వ రోజు బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 977 మంది గైర్హాజరయ్యారు. 83 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతున్న ఈ పరీక్షల్లో సెట్–2 ప్రశ్నపత్రంతో ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్లకు విద్యార్థులు పరీక్ష రాశారు. జనరల్ విభాగంలో 19410 మందికి 929 మంది, ఒకేషనల్ విభాగంలో 1155 మందికి 48 మంది గైర్హాజరయ్యారు. బుధవారం జిల్లాలో ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని ఆర్ఐఓ పి.దుర్గారావు ధృవీకరించారు.